## దర్గామిట్ట కతలు

# దర్గామిట్టలో రొట్టెల పండగ తీరు!



నెల్లూరు దర్గామిట్టకి రొట్టెల పండగొచ్చిందంటే మా ఊరికి ఎల్లవచ్చినట్టే. మా ఊరవేంది... మా జిల్లా హోల్మొత్తానికీ ఎల్లవే.

ఆ పండగ రోజు దర్గామిట్టకొస్తార్రా జనమూ... పుట్ట పగిలి చీమలు బయిటికొస్తుల్లా... అదే తీరు. బస్సుల్లో, రైళ్ళల్లో, టార్పాల్ పట్టాలు కట్టిన లారీల్లో, బండ్లల్లో రొట్టెలు చేసుకొని మూటలు కట్టుకొని మొక్కులు దీర్చుకునే దానికి యాడాడి నుంచో దిగబడిపోతారు. మరీ ముక్యంగా ఆడోళ్ళంతా ఊర్లు ఖాళీ చేసేసినారా అన్నట్టుగా బొట్లున్న ఆడోళ్ళతో, బొట్లులేని ఆడోళ్ళతో కిటకిటలాడిపోతుంది దర్గామిట్ట.

ఏమంటే ఆ రొట్టెల పండగలో మొక్కులు మొక్కేదీ మొక్కులు తీర్చేదీ ఆడోళ్లే.

మా యింట్లో ఎవ్వుడు యాడికెళ్ళాలన్నా "పిలకాయలకి ఆఫు టికెట్లు అడుగుతుండారు కండక్టర్ నచ్చినోళ్ళు. యాణ్ణుంచి తెచ్చేది" అని, మమ్మల్ని మా వాయినమ్మ ఎదాన పడేసి బస్కెక్కే మా అమ్మ రొట్టెల పండగప్పుడు మాత్రం పరమ దయాత్మురాలిలా మమ్మల్ని కూడా 'పోదాం పదండ్రో' అంటా బయల్దేర తీస్తుంది. (ఎందుకంటే ఆ రోజు నెల్లూరుకు పోయే రైళ్ళలో ఒక్కనా కొడుకూ టికెట్టు కొనడు). కసాబ్ గల్లీలో ఉండగా మేమంతా జైబూన్ ఆపా, ఖుర్షీద్‌బీలతో కలిసి రైలెక్కేవోళ్ళం. ఇప్పుడు పాతూరికి వచ్చేసినాం గదా. మా పెదమ్మ, మా జరీనాంటీలే తోడు.

అందరం కలిసి రొట్టెలు చేసుకొని పులిహోర కట్టుకొని చీకటితో పాసింజరు ఎక్కేసినామంటే బాగా ఎండొచ్చే టయానికి నెల్లూరులో దిగిపోతాము. యింకాడి నుంచి దర్గామిట్టకి నడిచేవోళ్ళు నడుస్తారు. టౌను బస్సులెక్కేవోళ్ళు టౌను బస్సు లెక్కుతారు. మా అమ్మ సంగతి తెలిసిందేగదా. మేము నడిచే వోళ్ళం – రాధా మాదవా, నర్తకీ సినిమా హాళ్ల వాల్‌పోస్టర్లు చూసుకుంటా.

నెల్లూరుకు దక్షిణం తట్టు, కళకళలాడతా ఉండే పెద్ద నీళ్ళ చెరువు గట్టున ఉంటుంది దర్గామిట్ట. చుట్టుపక్కలంతా పేద్ద మైదానం. నడిమధ్యన పన్నెండుమంది పీర్ల సమాదులున్న దర్గా! దీనినే మేము 'బారా షహీద్ దర్గా' అంటాము. ('బారా' అంటే పన్నెండు. 'షహీద్' అంటే వీరగతి పొందిన వాళ్లు).

యీ దర్గాను చూస్తే నాకు బలే బయమూ బక్తీ కలిగేవి. యీడ ఏ మొక్కు మొక్కుకున్నా నెరవేతుందని మా నాయినమ్మ చెప్తా వుంటుంది కాబట్టి నేనెప్పుడూ 'లెక్కల్లో నన్ను మాల్యాద్రయివోరు కొట్టకుండా వుండే మొక్కు' మొక్కుకుంటా వుండేవాణ్ణి. యీ దర్గా మీద ఒక కత వుంది. మా నాయినమ్మ చెప్పిన కత ప్రకారం ఎన్నో వందల ఏళ్ళ కిందట, యాణ్ణో ఒక మత యుద్దం జరిగిందంట. ఆ యుద్దంలో ఇస్లాం కోసరం, ఈమాన్ కోసరం పన్నెండు మంది యోదానుయోదులు కత్తులు చేతబట్టి పోరాడి వారంట. అయితే దుష్మన్‌లు మూకుమ్మడిగా దాడి చేసి వాళ్ల తలకాయలను ఎగరగొట్టినారంట. అయినాసరే మన యోదులు యుద్దం ఆపకుండా కత్తి వదలకుండా అట్టా పోరాడతా పోరాడతానే యిప్పుడున్న దర్గామిట్ట కాడకి మొండాలతో వచ్చి పడి 'షహీద్' అయినారంట. అప్పుడు ఆడున్న జనం ఆ పన్నెండు మంది మొండాలకి సమాదులు కట్టి, చుట్టూ నాలుగ్గోడలతో దర్గా ఏర్పాటు చేసి వారంట. ఆ తర్వాత్తర్వాత అదే 'దర్గామిట్ట' అయ్యిందంట.

'బారా షహీద్ దర్గా'లో ఉన్న పన్నెండుమంది 'షహీద్'ల పేర్లు తెలియక పోయినా, ఊర్లు తెలియక పోయినా వాళ్లు చూపే మహత్తు మాత్రం లోకానికి తెలిసి పొయ్యింది. ఆడ ఎవురు ఏ మొక్కు మొక్కుకున్నా జరూరుగా నెరవేరి తీరుతుందని మా జిల్లాలోనే కాదు, చుట్టుపక్కల జిల్లాలలోని మా వోళ్ళకీ, హిందువులకీ గురి ఏర్పడటంతో ఆడ జరిగే రొట్టెల పండక్కి అలివిగాని డిమాండు వచ్చేసిందన్న మాట.

ప్రతి సమచ్చరం పీర్ల పండగ (మొహర్రం) ముగిసిన రెండో రోజున దర్గామిట్టలో రొట్టెల పండగ ఉంటుంది. యీ పండగ సంగతి ఎవురూ ఎవురికీ ప్రత్యేకంగా చెప్పరు. క్యాలెండర్లో మొహర్రం ఎప్పుడో చూసుకొని దానికి రెండో రోజున రొట్టెలతో దర్గామిట్టకి వచ్చేస్తారు.

యిట్టా అందరూ వచ్చేస్తారు కాబట్టి ఆ రోజున దర్గామిట్టలో కాలు పెట్టేదానికి సందు వుండదు. మా అమ్మ జగత్ కిలాడీ కాబట్టి యాణ్ణో ఒక దిక్కాడ దుప్పటి పరిచి స్తావరం సంపాదిచ్చేస్తుంది. మమ్మల్నందర్నీ మా నాయినమ్మ కాడ కూచోబెట్టి, రొట్టెలు పట్టేదానికి మా పెదమ్మ, జరీనాంటీలతో కలిసి చెరువులోకి పోతుంది.

చేపలు పట్టడంలాగ, రొట్టెలు పట్టడం ఏందా? అని యిచిత్ర పోబాకండి. అసలు కదంతా ఆణ్ణే ఉంది.

రొట్టెల పండగలో 'మొక్కు' మొక్కుకోవడం అంటే ఆ 'మొక్కు పేరు'తో ఉన్న రొట్టెను పట్టాలన్న మాట. మాట వరసకి మనింట్లో పెళ్ళి కాని పిల్ల ఉండాదనుకోండి . ఆ పిల్లకి పెళ్ళికావడమే మన మొక్కయితే 'పెళ్లి రొట్టె' పట్టి ఆ పిల్ల చేత తినిపించాలన్న మాట.

యీ రొట్టె పట్టే పద్దతి బలే వుంటుంది.

ఎవురికి రొట్టే కావాలో వాళ్లు మొకాలి లోతు చెరువు నీళ్ళళ్ళో దిగి, రెండు చేతులతో కొంగు సాపి, "మోవ్! పెళ్ళి రొట్టె ఉందా? ఉంటే యియ్యండమ్మా" అని అడగతా ఉండాలి. అప్పుడు ఎవురో ఒకరు "నా దగ్గిర ఉందమ్మా పెళ్లిరొట్టె" అని, చెరువు నీళ్ళకు కొంగు తడిసేంతగా కిందకి ఒంగి, ఆ నీళ్ల మీదగా వాళ్ల దోసిట్లో నుంచి మన దోసిట్లోకి రొట్టె బదలా యిస్తారు.

యీళ్ళిట్టా పెళ్ళి రొట్టె యిస్తున్నారంటే ఆల్రెడీ మొక్కు తీరిపోయిన (పెళ్లి జరిగిపోయిన) వాళ్ళన్న

మాట! అంటే ఎవురెవురికైతే మొక్కులు తీరి పోతాయో వాళ్ళంతా మొక్కులు తీరాల్సినోళ్ళకి రొట్టెలు యిస్తారన్నమాట.

యీ పద్ధతిలో రకరకాల రొట్టెలు యిడిచేవాళ్లు (అంటే మొక్కులు తీరిన వాళ్లు), రకరకాల రొట్టెలు పట్టే వాళ్లు (అంటే మొక్కులు తీరాల్సిన వాళ్ళు) దర్గామిట్ట చెరువులోకి దిగి, రొట్టెల కోసరం కలబడతా నీళ్ళన్నీ బురదయ్యేలా ఎగబడుతా ఉంటారు.

మా అమ్మ ఎప్పుడు చూసినా రొట్టెలు పట్టే బ్యాచిలోనే ఉండేది. ఎట్టాగయినా చేసి మా యింటికి




కావలసిన రొట్టెలన్నీ సంపాదించుకొనొచ్చేది.

పస్తు రొట్టె మా నాయినమ్మ కోసం పడుతుంది మా అమ్మ. దీని పేరు 'ఆరోగ్యం రొట్టె'. ఆ రొట్టెని మా నాయినమ్మ తింటే ఒంట్లో వున్న జబ్బులూ రోగాలన్నీ దెబ్బకు ఎగిరిపోవాలని మా అమ్మ కోరిక.(అలా ఎగిరిపోయినాక మళ్లీ మనం వెళ్లి అనారోగ్యం వున్నోళ్ల కోసరం 'ఆరోగ్యం రొట్టె' వదలాలి). యింక మా నాయిన కోసరం రెండు రొట్టెలు పడుతుంది మా అమ్మ. ఒకటి 'సంపాదన' రొట్టె. ఇంకొకటి 'ఐశ్వర్యం' రొట్టె. మా అన్న చదువు మానేసి మా నాయినతో పాటు కరెంటు పనికి పోయి కష్టపడతా వున్నాడు కాబట్టి వాడికి 'సుఖం' రొట్టె. నేను చదివేది యిద్యానికేతన్ కాన్వెంట్ చదువు కాబట్టి నాకు 'చదువు' రొట్టె!

అయితే నాకు చదువు రొట్టే కంటే 'లెక్కల రొట్టె' తినాలని చాలా కోరిగ్గా వుండేది. అది తిని 'కా.సా.గు'లు, 'గా.సా.బా'లను మాళ్యాద్రయివోరి కాడ అదరేయాలని వుండేది. అయితే ఆ పేరుతో రొట్టే దొరికేది కాదు. అందరికీ అన్ని రొట్టెలు పట్టినాక మా అమ్మ మాత్రం చేతిగుడ్డలో వున్న 'సౌబాగ్యం' రొట్టెను తింటా కూచునేది.

మా అమ్మకు కావలసిన రొట్టెలు ఈ లెక్కన ఉంటే మా పెదమ్మకు, మా జరీనాంటీకి కావలసిన రొట్టెలు యింకోరకంగా ఉండేవి.

మా పెదమ్మ బర్త బంగారం లాంటి బ్యాంకుద్యోగం పోంగొట్టుకుని, తాతల కాలం నాటి బూమిలో పొగాకు పండిస్తానంట బయల్దేరివాడు. అసలికే ఆయనకు కుదరు తక్కువ. పైగా డిల్లీలో పనిచేసిన మాజీ మిలటరీ ఉద్యోగస్తుడు కూడా కాబట్టి సాయింత్రమయ్యిందంటే చాలు ఉన్న డబ్బులన్నీ ఎత్తకెళ్లి బ్రాందీ షాపులకే కర్సు పెడతా ఉంటాడు. కాబట్టి ఆయనొక్కడు బాగు పడితే చాలు యింకేమీ బళ్లా అన్నట్టుగా మా పెదమ్మ ఆయన కోసరం రకరకాల రొట్టెలు పడతా ఉంటుంది , ప్రతి సమచ్చరం.

యింక మా జరీనాంటీ అయితే ఆరోగ్యం రొట్టె, సౌబాగ్యం రొట్టె లాంటి చిన్న చిన్న రొట్టెల జోలికి పొయ్యేదికాదు. ఆమెదంతా జాక్‌పాట్– 'అదృష్టం' రొట్టెమీద. నీళ్లల్లో కొంగు పట్టుకొని తిరగతా, వెయ్యి మందిని అడిగైనా సరే 'అదృష్టం' రొట్టె సంపాదిస్తుంది. (అది తిన్నప్పట్నించి ఆమె బర్త వాజిద్ సాయిబు, దెబ్బతో అదృష్టం తిరిగి శనిద్రం అంతా తీరిపోవాలని, రూపాయి పెట్టి కొన్న బాగ్యజ్యోతి లాటరీ టికెట్టును జేబులో పెట్టుకొని తిరగతా ఉండేవాడు)

ఆడోళ్లిట్ట ఎవురిక్కాల్సిన రొట్టెల కోసం వాళ్లు తనకలాడతా వుంటే మొగపిలకాయల అగచాట్లు యింకో రకంగా **వుండేవి.** రొట్టెలు పట్టేపోళ్లు లాకో, పట్టినా దొరక్కోగానీ చాలా మంది మొగ పిలకాయలు దుప్పట్లు పరుచుకొని కూచోనున్న ఆడోళ్ల కాడికి వచ్చి 'మోవ్! ఒక్కరవ్వ ఉద్యోగం రొట్టె పెట్టండమ్మా' అని బతిమిలాడుకుంటా తిరగతా వుండేవాళ్లు. కొందరు పెళ్లి రొట్టె అడిగేవోళ్లు. కొందరు సంపాదన రొట్టె అడిగేవోళ్లు. కాటికి కాళ్లు సావుకున్న చాలా మంది ముసలోళ్లొచ్చి 'ఆయుష్షు' రొట్టె అడిగేవోళ్లు.

యీటన్నింటికంటే బాగా డిమాండు వున్న రొట్టె సంతానం రొట్టె. బ్లాకు టికెట్టు కోసం కొట్టుకున్నట్టుగా దీని కోసరం కొట్టుకునేవోళ్లు ఆడోళ్లు. యీడ సంతానం రొట్టే తింటే బిడ్డలు వుట్టకుండా పోయే కొసేనే లేదని అందరికీ అంత నమ్మకం. మద్యానానికి రొట్టెలు యిడవడం, రొట్టెలు పట్టడం పూర్తయినాక యింక అందరి చూపు సినిమా హాళ్ళ మీద పడేది. నెల్లూరు సినిమా హాళ్ళంటే హడలు. ఆ ఊర్లో సినిమా చూసిచ్చినామంటే మా జిల్లాలో ఏ ఊర్లో అయినా అది గొప్ప పనే కాబట్టి దర్గామిట్టకు వచ్చినోళ్ళంతా సినిమా హాళ్ళకు కుమ్ములో దుమ్ముగా మల్లుకునేవారు.

మేము కూడా మా పెదమ్మ, జరినాంటీలతో కలిసి సినిమా చూడటానికి 'కనకమహల్' కాడ కెళ్ళినాం. దానిలో 'ఇల్లాలి కోరికలు' సినిమా ఆడతా ఉంది. దానెదురుగా ఉన్న 'కొత్తహాలు'లో 'పట్నం వచ్చిన పతివ్రతలు' ఆడతా ఉంది.

"యిద్దరు హీరోలు ఉన్నారు. పట్నం వచ్చిన పతివర్తలకు పోదాం" అనింది మా అమ్మ.

"నేను రాను తల్లా. ఇందులో శోబన్‌బాబు, జయసుద ఉండారు. బలే ఉంటుంది. **శోబన్** బాబును జయసుద ఒదిలేస్తుందంట" అనింది శోబన్‌బాబు ఫ్యాన్సయిన మా పెదమ్మ.

"అదొద్దుమే ఏడుపు మొకం" అని బతిమిలాడింది మా అమ్మ, యీడ విడిపోతామో అన్న బయంతో.

మా పెదమ్మ రాలా.

జరినాంటీతో సహా మేమందరం పట్నం వచ్చిన పతివ్రతలు సినిమాకు పోతా ఆఖరిసారన్నట్టుగా మా పెదమ్మను అడిగినాం, 'రావా' అని.

మా పెదమ్మ అడుగు ముందుకెయ్యలా. పైగా "మా ఆయన చేత ఎన్ని రొట్టెలు తినిపించినా బాగుపడే కోరిక తీరేటట్టు లేదుగానీ యీ కోరికన్నా తీరసీయండి తల్లులారా" అని, ఇల్లాలి కోరికలకు టికెట్టు కోయించుకుంది.

–మహమ్మద్ ఖదీర్‌బాబు